
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 29 జూన్ 2024

ఎస్జీటీ ఖాళీలు, సీనియారిటీ జాబితాపై కసరత్తు

త్వరలో ముగియనున్న బదిలీ, పదోన్నతుల ప్రక్రియ

సంగారెడ్డి అర్బన్, జూన్ 28 : ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ తుది అంకానికి చేరుకున్నది. ఇక ఎస్జీటీ బదిలీలే మిగిలి ఉండగా... ఆ ప్రక్రియ కూడా శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఎస్జీటీల ఖాళీలు, సీనియారిటీ జాబితాపై కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 30న తుది జాబితా వెల్లడించి, వచ్చే నెల 2న బదిలీల ప్రక్రియ ముగించాలని అధికారులు భావిస్తున్నారు.

తెల్లారిన బతుకులు



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన మేకల లారీ క్యాబిన్

- జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
- ఐదుగురు మధ్యప్రదేశ్‌వాసులు దుర్మరణం
- లారీ కేబిన్‌లో ఇరుక్కున్న ఇద్దరి మృతదేహాలు
- మేకల కళేబరాల కింద మరొకరి మృతదేహం
- మరో ఐదుగురికి గాయాలు



చిక్కా రాజు



ఇబ్రహీం



మనీష్‌కుమార్



షబ్బీర్‌ఖాన్



జీసన్

చేగుంట, జూన్ 28: వ్యాపారం కోసం రాష్ట్రం కాని రాష్ట్రం వస్తుండగా.. తెల్లవారుజామున హైవేపై బతుకులు తెల్లారిపోయాయి. మేకల మండికి సమయానికి చేరాలనే ఆతృత. ఆలస్యం అయితే లారీ కిరాయితో పాటు మరో రోజు వేచి చూడాల్సి వస్తుందనే ఆందోళన వెరసి.. వేగంగా వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న మరో లారీని బలంగా ఢీ కొంది. లారీ కేబిన్‌లో ఇరుక్కుని ఇద్దరు.. మేకలతో కలిసి ట్రక్‌లో ముగ్గురు ఊపిరి ఆడక మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అసలేం జరిగింది. ఎంత మంది చనిపోయారు. ఎంత మందికి గాయాలయ్యాయి అన్న విషయం కూడా వెంటనే తేలలేదు. ఈ ప్రమాదంలో గాయాలు కాకుండా బయటపడిన ఒకరు తమ వాళ్లు లారీలో మేకలతో పాటు మరికొందరు ఉన్నారని చెప్పడం.. ప్రమాదంలో పదుల సంఖ్యలో మేకలు చనిపోగా.. వాటి కళేబరాలను తీస్తుండగా.. అందులోంచి మృతదేహం బయటపడడం విషాదం. అయితే, ఈ ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన వారంతా మధ్యప్రదేశ్‌కు చెందిన వారు కావడంతో చనిపోయిన వారి మృతదేహాలు మార్చురీలో.. గాయపడిన వారు హైదరాబాద్ ఆస్పత్రిలో ఉన్నారు. శుక్రవారం వేకువజామున మెదక్ జిల్లాలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం మిగిల్చిన విషాదం ఇది. మధ్యప్రదేశ్ రాష్ట్రం గుహరేవకు చెందిన సుమారు పదిమంది లారీలో మేకలు తీసుకుని హైదరాబాద్‌లోని మేకల మండికి వస్తున్నారు. వీరంతా మేకల వ్యాపారంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న లారీ శుక్రవారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో చేగుంట మండలం వడియారం 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ముందుగా పశువుల దాణాలో వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో ఎండీ ఇబ్రహీం(21), చిక్కా రాజు(57), చిక్వ మనీష్ కుమార్ (30), ఎండీ షబ్బీర్ ఖాన్ (48), ఎండీ జిషన్ (21)లు అక్కడికక్కడే చనిపోయారు. కేబిన్‌లో ఆరుగురు కూర్చొగా.. లారీ ఢీ కొనడంతో ఇందులో ఇద్దరు చనిపోయారు. వీరి మృతదేహాలు కేబిన్‌లో ఇరుక్కుపోయాయి. వెనుక మేకలతో నలుగురు ఉండగా, లారీ ఢీ కొని.. మేకలు మీద పడి ఊపిరి ఆడక ముగ్గురు చనిపోయిరు. మొదట నాలుగు మృతదేహాలు బయటపడగా, ఇదే లారీలో ప్రయాణిస్తున్న మనీలాల్ ఇచ్చిన సమాచారం మేరకు ప్రమాదం జరిగిన లారీ లోంచి మేకలను మరోలారీలోకి మారుస్తుండగా, ఇంకో మృతదేహం కనిపించింది. లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను తుప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, చేగుట ఎస్సై బాలరాజుల ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఇక లారీలో పదుల సంఖ్యలో మేకలు మృతి చెంది కనిపించాయి. మృతదేహాలను తుప్రాన్ ఏరియా ఆసుప్రతికి తరలించారు. గాయపడిన వారిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. వచ్చిన వారిలో ఒకరికి మినహా ఐదుగురు చనిపోవడం, మరో ఐదుగురు (ఒకరు లారీ డ్రైవర్) గాయపడటంతో ఒక్కరు మాత్రమే ఉన్నారు. శనివారం మధ్యప్రదేశ్ నుంచి బంధువులు వచ్చిన తర్వాత మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఎస్పీ డాక్టర్ బాలస్వామి సంఘటన స్థలాన్ని చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు.





ప్రమాదంలో మృతిచెందిన మేకలు, ప్రమాదం నుంచి బయటపడిన మణిలాల్‌తో మాట్లాడుతున్న పోలీసులు

చెట్ల కిందనే అంబులెన్సులు

నాలుగు నెలలుగా వృథాగా మూడు వాహనాలు

- సీఎస్ఆర్ కింద అందజేసిన ఎంఆర్ఎఫ్
- ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం

సంగారెడ్డి అర్బన్, జూన్ 28 : రోగులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడాల్సిన అంబులెన్సులు చెట్ల కింద సేదతీరుతున్నాయి. ప్రజలకు ఉపయోపడాలని అందజేసిన దాతల లక్ష్యం నెరవేరడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలుగు నెలలుగా నిరుపయోగంగా పడిఉన్నాయి. సంగారెడ్డి జిల్లా ప్రజలకు ఉపయోగపడడం కోసం ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ కింద నాలుగు అంబులెన్స్ వాహనాలను వైద్య ఆరోగ్యశాఖకు అందజేసింది. మార్చి 3వ తేదీన వీటిని స్వయంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఇందులో ఒక అంబులెన్స్‌ను జోగిపేట ఏరియా ఆస్పత్రికి కేటాయించగా, మిగిలిన మూడు వాహనాలు ప్రస్తుతం సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో చెట్ల కింద వృథా పడిఉన్నాయి.

అరకొరగా అంబులెన్స్ సేవలు

జిల్లాలోని ప్రధాన సర్కారు ఆస్పత్రుల్లో ఉచిత అంబులెన్స్ సేవలు అరకొరగా అందుతున్నాయి. జోగిపేట ఏరియా ఆస్పతి కింద రెండు అంబులెన్స్ వాహనాలుండగా, ఒకే డ్రైవర్ విధులకు గైర్హాజరవుతుండడంతో అక్కడ ఒక వాహనం ద్వారానే సేవలందిస్తున్నారు. నారాయణఖేడ్ ఏరియా ఏరియా ఆస్పత్రిలో రెండు వాహనాల్లో ఒక వాహనం రిజిస్ట్రేషన్ చేయని కారణంగా కొన్ని నెలలుగా పక్కన పెట్టారు. పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి కింద రెండు వాహనాలుండగా, ఒక డ్రైవర్ మాత్రమే ఉండడంతో ఇంకో వాహనం పక్కనపెట్టారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి కింద రెండు వాహనాల ద్వారా సేవలందిస్తున్నాయి. ఇక సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో రెండు అంబులెన్స్ వాహనాలు, ముగ్గురు డ్రైవర్లున్నారు. ఇక్కడ మరో వాహనం అవసరముందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే సదాశివపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కింద ఒక్క వాహనం కూడా లేదు. ఇక్కడ అంబులెన్స్ సేవలు చాలా అవసరమున్నాయని అక్కడి అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వృథాగా ఉంచిన మూడు కొత్త అంబులెన్స్ వాహనాలకు జిల్లాలోని వివిధ ఆస్పత్రులకు అవసరమున్న చోట కేటాయిస్తే రోగులను సకాలంలో చేరవేసేందుకు ఆ వాహనాలు దోహదపడనున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో ఉంచిన అంబులెన్స్‌లు



అద్దె భవనం.. ఆపై శిథిలం

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెచ్చిపెట్టే శాఖల కార్యాలయాలపై శీతకన్ను వేస్తున్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం జోగిపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. కొన్ని దశాబ్దాలుగా ఇది భారీగా ఆదాయం సంపాదించి పెడ్తున్నది. కార్యాలయం ఇప్పటికీ ఉన్ని పారిశ్రామిక సంఘానికి చెందిన అద్దె భవనంలోనే నడుస్తున్నది. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. సబ్ రిజిస్ట్రార్ కూర్చునే చోట సుమారు 3 మీటర్ల మేర పైకప్పు పెచ్చులూడిపోయింది.

-జోగిపేట, ఆగస్టు 5



పెచ్చులూడుతున్న పైకప్పు



పట్టపగలు లైట్లు వేసుకోవాల్సిన దుస్థితి (ఫైల్)

పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, జూన్ 28: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 469 మంది పరీక్షరాయగా 459 మంది ఉత్తీర్ణులయ్యారు. 97.87 ఉత్తీర్ణత శాతం నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. రికౌంటింగ్ కోసం వచ్చే నెల 8 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మెదక్ జిల్లాలో విద్యార్థులు 65.77 ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 710 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 467 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 273, బాలికలు 194 మంది పాసయ్యారు.

ఏబీవీపీ ఆందోళన ఉద్రిక్తం



సంగారెడ్డి డీఈవో ఆఫీసులోకి చొచ్చుకెళ్లేందుకు యత్నిస్తున్న విద్యార్థులు

- డీఈవో ఆఫీస్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం
- ఏబీవీపీ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట

6లో

డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ కార్యాలయాలకు నూతన భవనాలు

ప్రభుత్వానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ప్రతిపాదనలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 27 : సంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాల కోసం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రెండూ కార్యాలయాలు ఒకే భవనంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు ఈమేరకు రూ.9.98 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం డీఎంహెచ్‌వో కార్యాలయం సంగారెడ్డి జీజీహెచ్ ప్రాంగణంలోని టీవీవీపీ ఉద్యోగుల క్వార్టర్స్‌లో కొనసాగుతున్నది. డీసీహెచ్ఎస్ కార్యాలయం జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్ సమీపంలో కొనసాగిస్తున్నారు. అయితే టీవీవీపీ ఉద్యోగుల క్వార్టర్స్ కలుపుకుని ఎకరా స్థలాన్ని అప్పటి జిల్లా కలెక్టర్.. డీఎంహెచ్‌వో కార్యాలయానికి కేటాయించారు. అదే స్థలంలోనే నూతన భవనం నిర్మించాలని భావించిన అధికారులు టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. పరిపాలన అనుమతుల నిమిత్తం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ కార్యాలయ భవన శంకుస్థాపనకు మార్గం సుగమం కానున్నది.



డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ ఆఫీస్‌ల శిలాఫలకం

ఎన్ఎంసీ నిబంధనలకు విరుద్ధం!

సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏ ఇతర కార్యాలయాలు ఉండేందుకు వీలులేదని, ఇది ఎన్ఎంసీ నిబంధనలకు విరుద్ధమని వైద్య విద్య అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ, ఇదే ప్రాంగణంలో నూతన భవనం నిర్మించాలని నిర్ణయించిన అధికారులు ఆ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడంతో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొన్నది.

మహాత్ముడి సాక్షిగా.. విద్యార్థులే స్వీపర్లు

చీపురు పట్టి తరగతి గదులు శుభ్రం చేసుకుంటున్న వైనం

స్కావెంజర్‌లను తొలగించడంతోనే దుస్థితి



7లో



టీచర్ల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు

టీచర్లను నియమించండి..

- ఉపాధ్యాయుల కొరత తీర్చాలని రోడ్డెక్కిన విద్యార్థులు
- గ్రామస్థులు, తల్లిదండ్రులతో కలిసి వంటావార్పు
- మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో ఘటన..

ఆలస్యంగా వెలుగులోకి

చిన్నశంకరంపేట, జూన్ 28: తమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలంటూ మెదక్ జిల్లా చిన్నశకరం మండలం శాలిపేట గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు రోడ్డెక్కారు. రహదారిపై దాదాపు మూడు గంటల పాటు రాస్తారోకో చేశారు. తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి రోడ్డుపై వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలలో 145, ప్రాథమిక పాఠశాలలో 135 మంది ఉండగా, ఉన్నత పాఠశాలలో నలుగురు, ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారని వాపోయారు. ఏడేళ్ల నుంచి ఉపాధ్యాయుల కొరత ఉందని, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేక తమకు సరైన బోధన అందడంలేదని వారు తెలిపారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎంఈవో బుచ్చయ్య నాయక్ అక్కడికి చేరుకోగా, ఉపాధ్యాయులను నియమించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని విద్యార్థులు ఎంఈవోకు స్పష్టం చేశారు. ఉపాధ్యాయులను నియమించేందుకు కృషి చేస్తానని ఎంఈవో హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.



ఎంఈవోతో వాగ్వాదానికి దిగిన విద్యార్థులు

‘ఏబీవీపీ’ ఆందోళన ఉద్రిక్తం

- సంగారెడ్డి డీఈవో ఆఫీస్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం
- నాయకులు, పోలీసుల మధ్య తోపులాట

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల డీఈవో కార్యాలయాల ముట్టడికి యత్నించగా, మెదక్ జిల్లా కేంద్రంలో డీఈవో దిష్టిబొమ్మను దహనం చేశారు.


సంగారెడ్డి డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయించిన నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 28 : ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన డీఈవో కార్యాలయ ముట్టడి సంగారెడ్డి జిల్లాలో ఉద్రిక్తతకు దారితీసింది. సీఎం, డీఈవో డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు డీఈవో కార్యాలయంలోకి ఒక్కసారిగా చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నాయకులు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి పోలీసులు సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం డీఈవో కార్యాలయ ఏడీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు మాట్లాడుతూ ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆ పార్టీని బొందపెట్టారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భారతి, మహేశ్, అనిల్, పవన్‌తదితరులు పాల్గొన్నారు.

డీఈవో దిష్టిబొమ్మ దహనం

మెదక్ అర్బన్, జూన్ 28: ప్రైవేటు స్కూల్స్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న, అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ.. మెదక్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం అమ్ముతున్న డీఈవో చర్యలు తీసుకోకుండా ప్రైవేటు యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులను వసూలు చేస్తూ.. పేద విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీల్చుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేక విద్యార్థులతో పని చేయిస్తున్నారన్నారు. వెంటనే ప్రైవేటు పాఠశాలల ఆగడాలను అరికట్టి, నిబంధనలు పట్టించుకోని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు విజ్ఞాన్, నిఖిల్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సిద్దిపేట క్రైం, జూన్ 28 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బీరకాయల వివేక్ వర్ధిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట డీఈవో ఆఫీస్ ఎదుట ఏబీవీపీ నాయకులతో ధర్నాకు దిగి మాట్లాడారు. తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచినా పార్టీలు మారాయి కానీ, విద్యార్థులు బతుకులు మారలేదన్నారు. ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు న్యాయం దొరకకపోతే గద్దె దించడం ఖాయమన్నారు. అనంతరం అడిషనల్ డీఈవో వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య, పవన్, నగర కార్యదర్శి పర్శరాం, రాజేష్, రాజు, మహేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ డీఈవో వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఏబీవీపీ నేతలు, సిద్దిపేట డీఈవో కార్యాలయం వద్ద బైఠాయించిన నాయకులు

అడవి పందిని తప్పించబోయి

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ఒకరి మృతి

కౌడిపల్లి, జూన్ 28 : అడవి పంది అడ్డు రావడంతో ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీ కొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని తుకిని శివారులో గురువారం అర్ధరాత్రి జరిగింది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలంలోని జక్కపల్లి గ్రామానికి చెందిన కొనంటి మహేష్‌గౌడ్ తన కారులో తునికి గ్రామానికి చెందిన బంధువు అయిన నర్సాగౌడ్ ఇంటికి సొంత పని ఉందంటూ రాత్రి 11 గంటల ప్రాంతంలో బయలు దేరాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో తునికి గేట్ సమీపంలోకి రాగానే అడవి పంది అడ్డు రావడంతో తప్పించబోగా రోడ్డు పక్కన పార్కు చేసి ఉంచిన లారీని కారు బలంగా ఢీ కొన్నది. దీంతో కారు పూర్తిగా లారీ కిందకు వెళ్లిపోవడంతో మహేష్‌గౌడ్ కారులో ఇరుక్కుపోయాడు. విషయం తెలిససుకున్న పోలీసులు సంఘటన స్థలంకు చేరుకుని కారును ఎక్స్‌కవేటర్ సహాయంతో తీసిచూడగా అప్పటికే మహేష్ మృతిచెందాడు. మహేష్‌గౌడ్ భార్య ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీ కిందికి దూసుకెళ్లిన కారు, మహేష్‌గౌడ్(ఫైల్)

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, జూన్ 28 : ఓ బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు, జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి శుక్రవారం తీర్పు చెప్పారు. కంది మండలానికి చెందిన బేగరి మురళి(24) 2017 సంవత్సరంలో ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధించాడు. ఆ బాలిక తల్లిదండ్రులు సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ శివలింగం కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కాగా నిందితుడు బేగరి మురళికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

మున్సిపల్‌లో మూలుగుతున్న

స్టీల్ ప్లేట్లు, గ్లాసులు

అటకెక్కిన ప్లాస్టిక్ నివారణ


తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో భద్రపరిచిన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు

తూప్రాన్, జూన్ 28: ప్లాస్టిక్ నివారణ చేసేందుకు చేపట్టిన కార్యక్రమం అటకెక్కింది. తడి, పొడి చెత్త సేకరణ జాడే లేకుండా పోయింది. పట్టణ ప్రగతి, స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు తూతు మంత్రంగా చేస్తున్నారు. ఫలితంగా పట్టణ పరిశుభ్రత గాలికి వదిలేసినట్లుగా తయారైంది. తూప్రాన్ పట్టణ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. తడి, పొడి చెత్త సేకరణ చేస్తామని చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ చేస్తున్న చర్యలకు మద్దతుగా ఓ ప్రైవేటు కంపెనీ ప్లాస్టిక్ నిషేధం చేసేందుకు సహకరించింది. అంతకుముందు పట్టణంలో వేడుకల్లో ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకోడానికి మున్సిపల్ పాలకవర్గం నిర్ణయించింది. వేడుకల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా చూడాలని చర్యలు చేపట్టారు. దీని కోసం స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను సీఎస్ఆర్ పథకం కింద ఓ ప్రైవేటు కంపెనీ అందజేసింది. వెయ్యి స్టీల్ ప్లేట్లు, వెయ్యి స్టీల్ గ్లాసులు, ఇతర స్టీల్ సామగ్రిని అందజేసింది. వాటిని ఏడాది క్రితమే అందజేయగా మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. వాటిని మెప్మా సిబ్బందికి అందజేయగా బీరువాల్లో భద్రపరిచారు. ఏడాది గడిచిపోయినప్పటికీ వాటి వినియోగంపై ప్రచారం నిర్వహించకపోగా, కంపెనీ అందజేసిన స్టీల్ ప్లేట్లు, గ్లాసెలు అందజేసే ప్రయత్నం కూడా చేయలేదు. మహిళా సంఘాల సభ్యులు అందజేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ సభ్యులకు అందజేసే ప్రయత్నం కూడా చేయలేదు. ప్రైవేటు కంపెనీ ఓ మంచి లక్ష్యంతో అందజేసిన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు మూలకు చేరడంతో ఫలితం లేకుండా పోయింది. అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై తీసుకుంటున్న చర్యలో స్టీల్ గ్లాసులు, ప్లేట్లు వినియోగించే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

అవగాహనకు చర్యలు తీసుకుంటున్నాం

ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ముందుగా ప్రజల్లో చైతన్య తెచ్చే కార్యక్రమం తీసుకోబోతున్నాం. బ్యానర్లు, పోస్టర్ల సహాయంతో ప్రచారం చేస్తాం. ఇప్పటికే ఆడియో అనౌన్స్‌మెంట్ సిద్ధం చేశాం. ప్లాస్టిక్ వినియోగించకుండా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాస్‌లు అదే ధరకు అందజేసే చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ వాడితే ప్రజలకు సైతం జరిమాన వేస్తాం.

– ఖాజా మొహిజుద్దీన్, మున్సిపల్ కమిషనర్

మహాత్ముడి సాక్షిగా..
విద్యార్థులే స్వీపర్లు

స్కావెంజర్‌లను తొలగించడంతోనే ఈ దుస్థితి



గడిపెద్దాపూర్ ఉన్నత పాఠశాలలో చీపురుతో ఊడుస్తున్న విద్యార్థి

అల్లాదుర్గం, జూన్ 28 : బడి మానేసిన బడీడు పిల్లలను, బాల కార్మికులను పాఠశాలలో చేర్పించి విద్యనందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. కానీ, బడుల్లో మాత్రం విద్యార్థులే స్వీపర్లుగా మారుతున్నారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు రోజు సాయంత్రం పాఠశాల సమయం ముగిసిన తర్వాత చీపుర్లను పడుతు తరగతి గదులను, పాఠశాలను శుభ్రం చేస్తున్నారు. స్థానికులు శుక్రవారం పాఠశాలను సందర్శించగా ఈ దృశ్యాలను కనిపించాయి. ఇలా పాఠశాల తరగతి గదులను ఊడ్చడం ఏమిటంటూ విద్యార్థులను వారు ప్రశ్నించగా తాము ప్రతీ రోజు పాఠశాల ముగిసిన తర్వాత ఊడ్చి వెళ్లిపోతామని విద్యార్థులు తెలిపారు. పారిశుధ్య పనులను చేసే స్కావెంజర్లను మూడేళ్ల క్రితం తొలగించారు. పాఠశాల నిర్వహణను ఆయా గ్రామాల పంచాయతీలకు ప్రభుత్వం అప్పగించింది. అయితే, పంచాయతీ పారిశుధ్య కార్మికులు సైతం పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొన్నది.

మల్లన్న ఆలయానికి
రూ.84.51 లక్షలు ఆదాయం

- ప్రశాంతంగా సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం
- తలనీలాలు, కొబ్బరికాయల విక్రయం తదితరాల వాయిదా



టెండర్ బాక్సును తెరిచి షెడ్యూల్స్ పరిశీలిస్తున్న సిబ్బంది

చేర్యాల, జూన్ 28 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శుక్రవారం ఈవో బాలాజీ శర్మ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.84.51లక్షల ఆదాయం సమకూరింది. అలాగే పలు విభాగాలకు సంబంధించి గతేడాది కన్నా అధికంగా ఆదాయం సమకూరనున్నది. మల్లన్న ఆలయ ఆవరణలో కొబ్బరికాయల విక్రయ హక్కు రూ.32.50లక్షలు, ఎల్లమ్మ ఆలయంలో ఒడిబియ్యం, శేషవస్త్రాల సేకరణను రూ.15.60లక్షలు, కోరమీసాలు, వెండి మొక్కుబడుల విక్రయ హక్కును రూ.16.25లక్షలు, పూజా సామగ్రి, కూల్‌డ్రింక్స్ విక్రయం రూ.15.65 లక్షలు పలికాయి. ప్రసాద తయారీకి సంబంధించి 100 గ్రాముల పరిమాణం గల చిన్న లడ్డూ రూ.18.50, అభిషేకం లడ్డూ రూ.11.50, పులిహోర ప్యాకెట్ 80పైసలు, సిరా ప్రసాదం 20పైసలు చొప్పున, లీటరు పాలకు రూ.55, కిలో పెరుగు రూ.20 చొప్పున ఖరారైంది. నిత్యం పూలు, పూలదండల సరఫరా రూ.1,195 ధర పలికింది. సులభ్ కాంప్లెక్స్ బ్లాక్ లీజు ద్వారా రూ.4.51లక్షలు సమకూరనున్నాయి. తలనీలాల సేకరణ, మల్లన్న, ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరి ముక్కల సేకరణ, ఎల్లమ్మ ఆవరణలో కొబ్బరి కాయల విక్రయం, చెప్పుల స్టాండు, బ్యాగులు భద్రపరుచుట, మల్లన్న ఆలయంలో ఒడిబియ్యం, పసుపు, వస్త్రాల సేకరణకు గతేడాదికన్నా తక్కువ పాట రావడంతో వాయిదా వేశారు.

సెల్‌ఫోన్ డిపాజిట్ టెండర్ ఎత్తివేతపై భక్తుల హర్షం

గతసంవత్సరం సెల్‌ఫోన్ డిపాజిట్ టెండర్‌దారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసి భక్తులపై దౌర్జన్యం ప్రదర్శించిన విషయం తెలిసింది. బలవంతంగా ఫోన్లు లాక్కుని భౌతిక దాడులకు పాల్పడగా వివాదాస్పదం కావడంతో దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈవో బాలాజీశర్మ ఈసారి డిపాజిట్ టెండర్ ఎత్తివేయడం పట్ల భక్తులు హర్షం వెలిబుచ్చుతున్నారు. వేలం పాటలలో జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, ఆలయ ఏఈవోలు బుద్ధి శ్రీనివాస్, గంగా శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో
ఇతర శాఖల అధికారుల జోక్యం వద్దు !

- నల్లగొండ డాక్టర్లు, సిబ్బందికి వైద్యుల మద్దతు
- సంగారెడ్డి జీజీహెచ్‌లో డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన



సంగారెడ్డి జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, జూన్ 28 : నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో అక్కడి కలెక్టర్ ఆదేశాల మేరకు ఇతర శాఖ అధికారుల జోక్యాన్ని నిరసిస్తూ సంగారెడ్డిలోని జీజీహెచ్ డాక్టర్లు శుక్రవారం నిరసన తెలిపారు. అక్కడి ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందికి మద్దతుగా ఇక్కడ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) సంగారెడ్డి యూనిట్ అధ్యక్షురాలు డా.లావణ్య, కార్యదర్శి డా.రమేశ్‌లు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఇతర శాఖల అధికారుల పెత్తనం సరికాదన్నారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధం లేని అధికారులను పర్యవేక్షణకు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అక్కడి కలెక్టర్ ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్లగొండ ఆస్పత్రి డాక్టర్లకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీజీటీఏ కోశాధికారి సంతోష్, ప్రసాద్, గోవింద్, శ్రీకాంత్, కిరణ్, అనిల్, అశోక్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన వర్క్‌షాప్

పటాన్‌చెరు రూరల్, జూన్ 28 : ఎఫ్‌జీఏలు, వాటి సామర్థ్యాన్ని అర్థం చేసుకునే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రయోగాత్మక కార్యశాల శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అరేస్ (ఎఫ్‌జీఏ)పై అధ్యాపకులు, పరిశోధకులకు సమగ్ర అవగాహన కల్పించడానికి, ఈ కార్యశాలలో ఎఫ్‌జీఏ ఆర్కిటెక్చర్, డిజైన్ మెథడాలజీలు, ప్రోగ్రామింగ్ టెక్నికల్‌పై దృష్టి సారించే సిద్ధాంతిక సెషన్‌లో పాటు ప్రాక్టికల్ ల్యాబ్‌లను నిర్వహించారు. సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ కృత్రిమ మేథతో సహా వివిధ రంగాలలో ఎఫ్‌పీజీఏల బహుముఖ అనువర్తనాలను అన్వేషించేలా ప్రోత్సహించారు. ఈ కార్యశాలలో పాల్గొన్న దాదాపు 40 మంది అధ్యాపకులు, పరిశోధక, సీజీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి అతిథులను స్వాగతించగా, నిర్వాహకుడు ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ముడిమేల వందన సమర్పణ చేశారు.



గీతంలో నిర్వహించిన కార్యశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్



రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు



నిలిచిపోయిన బ్రిడ్జి పనులు

రోడ్ల మధ్యలో స్తంభాలు.. పూర్తికాని మురుగు కాలువలు

కొండపాక మండలంలో అస్తవ్యస్తంగా సిద్దిపేట రింగ్‌రోడ్డు నిర్మాణం.. మధ్యలోనే నిలిచిన పనులు

కొండపాక, జూన్ 28 : కొండపాక మండలం నుంచి నిర్మిస్తున్న సిద్దిపేట రింగ్ రోడ్డు పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడికక్కడ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ఇబ్బందికరంగా మారింది. వర్షం పడితే నీరునిలిచి చిత్తడిచిత్తడి తయారవుతోంది.

సిద్దిపేట చుట్టూ అన్ని గ్రామాలను కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నంగునూరు మండలం పాలమాకుల, వెంకటాపూర్, తిమ్మాయిపల్లి నుంచి బందారం మీదుగా దుద్దెడ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులు పూర్తికావచ్చాయి. బందారం నుంచి దుద్దెడ వరకు పనులను ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. దుద్దెడలో ఒకవైపు మాత్రమే బీటీ రోడ్డు వేశారు. రెండో వైపు విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కకు తొలగించకుండా మధ్య నుంచే కంకర వేసి నిర్మాణ పనులు చేశారు. విద్యుత్ స్తంభాలను తొలగించి పక్కకు ఏర్పాటు చేసిన తర్వాత రోడ్డు పోయాల్సి ఉండగా స్తంభాలను అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనాలపై వెళ్లేవారు రాత్రి వేళల్లో ప్రమాదాలు గురయ్యే అవకాశం ఉంది. అలాగే రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వలను ఎత్తుగా చేయకుండానే అలాగే ఉంచడంతో వాటిలో మట్టి, కంకర పడి కూరుకపోయాయి.

ఆగిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం

దుద్దెడ బందారం వెళ్లే రోడ్డుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఉన్న లోలెవెల్ బ్రిడ్జిని తొలగించారు. పనులను ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. దుద్దెడ నుంచి బందారం, అంకిరెడ్డిపల్లి తదితర గ్రామాలకు వెళ్లేందుకు బ్రిడ్జి పక్క నుంచి తాత్కాలిక రోడ్డును వేశారు. నెలరోజుల నుంచి పనులు ఆగిపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వర్షాలు పడితే ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారుతుందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పనులు తొందరగా పూర్తి అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి

వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వైనం

శివ్వంపేట, జూన్ 27 : గృహ అవసరాల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గ్యాస్ పక్కదారి పడుతుంది. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడిగా స్వీట్‌హౌజ్, హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లు, పరిశ్రమల్లో వినియోగిస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. దొంతి గ్రామంలోని హోటల్‌లో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచడం దీనికి నిదర్శనం. మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు గోమారం, దొంతి శభాష్‌పల్లి, పలు గ్రామాల్లో ఎక్కువగా ఇలా జరుగుతోంది. వ్యాపార, వాణిజ్య అవసరాలకు సబ్సిడీ లేని గ్యాస్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గ్యాస్ ఏజెన్సీలు సైతం అసలైన గృహ వినియోగదారులకు ఇబ్బందులకు గురి చేస్తూ వ్యాపారులకు మాత్రం అడిగిన వెంటనే గ్యాస్‌ను అందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అసలైన లబ్ధిదారులకు సకాలంలో గ్యాస్ అందడం లేదు. ఈ విషయమై డీఎస్‌వో బ్రహ్మారావును సంప్రదించగా పర్యవేక్షించి నిబంధనలను విరుద్ధంగా సబ్సిడీ గ్యాస్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



దొంతి గ్రామంలోని ఓ హోటల్‌లో నిల్వ ఉంచిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు

ఆరోగ్య కేంద్రాలకు
అనుమతి తప్పనిసరి

- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం పొందాలి
- సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ

సంగారెడ్డి అర్బన్, జూన్ 28 : జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం అనుమతి పొందాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఏప్రిల్ నుంచి జూన్ 15 వరకు దరఖాస్తు చేసుకున్న వైద్య సంస్థల వివరాలు కలెక్టర్ సంగారెడ్డి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, ఏమైనా అభ్యంతరాలుంటే సరైన ఆధారాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వైద్య సంస్థల పరిశీలనకు ఏడు బృందాలను నియమించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని కేంద్రాలపై రూ.2 లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు ఆ కేంద్రాలను మూసివేస్తామని హెచ్చరించారు. దరఖాస్తు చేసుకోని వారు వచ్చే నెల 5వ తేదీలోపు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు రికార్డ్స్ నిర్వహించాలని, ఆస్పత్రికి సంబంధించిన అన్ని అనుమతులు బయోమెడికల్ వేస్ట్, పొల్యూషన్, ఫైర్ సర్టిఫికేట్లు పొంది ఉండాలని పేర్కొన్నారు. రోగులకు అర్థమయ్యే విధంగా ధరల పట్టికను ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఆర్ఎంపీ డాక్టర్లు తమ పరిధికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం ప్రతీ నెల స్కానింగ్ నివేదికలు సమర్పించని కారణంగా శుక్రవారం ఆమె తనిఖీ చేసి స్కానింగ్ కేంద్రాన్ని మూసివేశారు.

ఎస్సీఈఆర్‌టీలో ఉపాధ్యాయురాలికి చోటు



మాధవి

దుబ్బాక టౌన్, 28: దుబ్బాక మండలం లచ్చపేట గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి సక్సెస్ స్టోరీని తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ గుర్తించింది. ఈ విద్యాసంవత్సరానికి(2023-24)గాను ప్రచురించిన స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, హార్బింజర్ ఆఫ్ చేంజ్(ఎస్సీఈఆర్‌టీ) పుస్తకంలో ఆమె సక్సెస్ స్టోరీని ప్రచురించింది. నూతన బోధన ఉపకరణాల రూపకల్పన చేయడంతో వినూత్న పద్ధతుల్లో పాఠాలు బోధిస్తున్నందుకుగాను ఆమెకు ఈ గుర్తింపు లభించింది. మాధవిని హెడ్‌మాస్టర్ సహా ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- కిశోర బాలికలకు 16 వస్తువులతో కూడిన న్యూట్రీషన్ కిట్లు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూన్ 28 : పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బేటి బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిత సాధికారత కేంద్రం (డీహెచ్‌ఈడబ్ల్యూ) ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం బాలికలకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని, ఆరోగ్యంగా ఉంటేనే ఏ రంగంలో అయినా రాణిస్తారని అన్నారు. కిశోర బాలికల పెరుగుదల చాలా వేగంగా ఉంటుందని, పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 360 మంది బాలికలకు 16 వస్తువులతో కూడిన న్యూట్రీషన్ కిట్లను అందించామన్నారు. ఈ కిట్‌లోని ప్రతీ వస్తువు ఉంతో ఉపయోగకరమైనదని, వాటిని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలితకుమారి, డీసీపీవో రత్నం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, బాలికలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వారంలోగా పనులు పూర్తవ్వాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వారంలోగా పూర్తి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నూతన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణంలో విద్యా బోధన జరిగేలా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి ఆహ్లాదకరంగా మారుస్తున్నామన్నారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డీఈఏఈలను ఆదేశించారు.



బాలికకు న్యూట్రీషన్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

హృదయ ఆధారిత బోధనను అలవర్చాలి

కేజీబీవీ విద్యార్థులకు హృదయ ఆధారిత విద్యాబోధన, నైపుణ్యాలు, ప్రాజెక్టు నిపుణ లాంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రకాశవంతమైన మనసులో విద్యార్థులు కళ్లు మూసుకుని రంగులు గుర్తించడం, జ్ఞాన సంబంధమైన అభిజ్ఞ నైపుణ్యాలు లాంటివి అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించే వీలుంటుందని పేర్కొన్నారు. కేజీబీవీ విద్యార్థులకు మెడిటేషన్ అలవాటు చేయాలని సూచించారు. 17 కేజీబీవీ టీచర్లు, విద్యార్థులకు హెల్ప్ ప్రోగ్రామ్ శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇతర పాఠశాలల్లోని విద్యార్థులకూ ట్రైనింగ్ ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో పీడీ జ్యోతి, కేజీబీవీ అధికారి సుప్రియ, ఆర్పీ వెంకటేశం, శిక్షకులు కన్నా, శాంతివనం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- పశువైద్యాధికారులు సమయపాలన పాటించాలి
- స్పెషల్ డ్రైవ్ ద్వారా భూ సమస్యలకు పరిష్కారం
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, జూన్ 28 : ఆరోగ్యానికి కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం వెల్దుర్తి మండలంలో కలెక్టర్ పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్య కేంద్రాన్ని సందర్శించి ఆస్పత్రిలోని వృద్ధురాలితో వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగారు. ప్రాథమిక ఆరోగ్య, పశువైద్య కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్య, వెటర్నరీ వైద్యురాలు రేఖను అడిగి తెలుసుకున్నారు. పశు వైద్యాధికారులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డు రూమ్, ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రైతుల దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలో 100 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ తులసీరామ్, ఆర్ఐ జయభరత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్, వెల్దుర్తి పంచాయతీ ఈవో బలరాంరెడ్డి తదితరులు ఉన్నారు.



మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పది నెలలుగా వేతనాల్లేవ్?

- దిక్కుతోచని పరిస్థితిలో పంచాయతీ సిబ్బంది
- కుటుంబాన్ని పోషించుకోలేక అప్పులపాలు



సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు (ఫైల్)

సిద్దిపేట అర్బన్, జూన్ 28 : గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు 10 నెలల నుంచి జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, హరితహారం, వైకుంఠధామాలు, వీధి దీపాలు, డంపింగ్‌యార్డ్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు జీతాలు రాక విలవిలలాడుతున్నారు. కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, అప్పు చేసి బతకాల్సిన దుస్థితి ఏర్పడిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా తమ పరిస్థితులు మారలేదని మండిపడుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీల్లో 2500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కార్మికులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఆయా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కార్మికుల డిమాండ్‌లు

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతోపాటు ఐదు లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాత కేటగిరీలను కొనసాగించాలని కోరుతున్నారు. సంవత్సరాల తరబడి పనులు చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలంటున్నారు. జీవో నెంబర్ 51ని సవరించాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. దహన ఖర్చులను రూ.10 నుంచి 20 వేలకు పెంచాలంటున్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

అప్పు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది

పది నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబాన్ని పోషించడం చాలా కష్టంగా మారింది. పనిచేస్తే కానీ కడుపు నిండని మాకు నెలల తరబడి జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీతాలు వస్తాయన్న ఆశతో అప్పులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి జీతాలు చెల్లించాలని కోరుకుంటున్నాం.

- రాజనర్సు, గ్రామ పంచాయతీ కార్మికుడు, పొన్నాల

సమస్య పరిష్కరించేంతవరకు సమరశీల పోరాటం

గత పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం చెల్లించాలి. ప్రభుత్వం మారిన పంచాయతీ కార్మికుల తలరాతలు మారలేదు. చాలీచాలని వేతనాలు ఇస్తూ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. ఇచ్చే అకాస్త వేతనాలు కూడా సమయంకు ఇవ్వడం లేదు. పెండింగ్ వేతనాలు చెల్లించి కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తాం.

-గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి.

సమష్టి కృషితో అభివృద్ధి చేశాం



శివ్వంపేట మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే సునితారెడ్డి

మండల ప్రజాపరిషత్ పాలవర్గాల గడువు సమీపించిన నేపథ్యంలో శుక్రవారం మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల కాలంలో సమష్టి కృషితో చేసిన అభివృద్ధి పనులను ఆయా పాలకవర్గాల సభ్యులు గుర్తు చేసుకుంటూ, అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. పాలక వర్గాలకు ఇదే చివరి సమావేశం కావడంతో సభ్యులను అధికారులు శాలువాలతో సన్మానించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త: సునితారెడ్డి

శివ్వంపేట, జూన్ 28: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సిబ్బందితో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా అధికారులు చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. శుక్రవారం శివ్వంపేట మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అధ్యక్షతన చివరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీటీసీల పదవీకాలం ముగిసిపోవడంతో ఎంపీటీసీలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీపీ హరికృష్ణను అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎంపీటీసీలు, మండల అభివృద్ధికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, తహసీల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో నాగేశ్వర్, మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, చంద్ర గౌడ్, కోఆప్షన్ సభ్యులు లాయక్ ఉన్నారు.


కొడిపల్లి: సమావేశంలో మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, పాలకవర్గ సభ్యులు

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

కొడిపల్లి, జూన్ 28: వర్షాకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల ఎంపీపీ రాజు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కాలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజల మధ్య ఉండి అనేక ప్రజా సమస్యలను పరిష్కరించారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండల ప్రజాపరిషత్, తహసీల్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి నూతనంగా నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎంపీటీసీలను, మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, జడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, తహసీల్దార్ అంజనేయులు, వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, పీఆర్ డీఈ అమరేశ్వర్‌తో పాటు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.



అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి

సమష్టి కృషితో అభివృద్ధి సాధ్యమైంది

అల్లాదుర్గం, జూన్ 28: అధికారులు, ప్రజల సహకారంతో మండలం ఎంతో అభివృద్ధి సాధించామని అల్లాదుర్గం ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం ప్రస్తుత పాలకవర్గానికి చివరి సమావేశం కావడంతో ఈ సమావేశంలో ఎలాంటి సమస్యలను చర్చించకుండా గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ కమిటీ సభ్యులు కాశీనాథ్, స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు సౌందర్య, ఉపాధ్యక్షురాలు పల్లెగడ్డ స్వరూప, ఎంపీడీవో శంకర్ యాదవ్, తహసీల్దార్ సతీష్‌కుమార్, సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మనోహరాబాద్: ఎంపీపీ నవనీతారవిని సన్మానిస్తున్న వివిధ శాఖల మండల అధికారులు

అధికారులు సహకరించారు

మనోహరాబాద్, జూన్ 28: ఎంపీపీ పురం నవనీత రవి ఆధ్వర్యంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పురం నవనీతారవి మాట్లాడుతూ మండలంలో అనేక అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. ఇందుకు అధికారులు సైతం సహకరించారని తెలిపారు. పాలకవర్గానికి ఇదే చివరి సమావేశం కావడంతో ఎంపీపీ పురం నవనీతరవి మండల శాఖ అధికారులందరిని సన్మానించి, ఎంపీపీ చిత్రపటాలను బహుమతిగా అందజేశారు. అధికారులు అందరూ ఎంపీపీ నవనీతను సన్మానించి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఎంపీటీసీలు శ్రీలతావెంకట్‌గౌడ్, శ్రీలతాఆనంద్, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో పట్టపగలే చోరీ

తూప్రాన్, జూన్ 28: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే బంగారు, వెండి ఆభరణాల చోరీ జరిగింది. ఈ ఘటన తూప్రాన్ పట్టణంలోని సాయికాలనీలో శుక్రవారం చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణంలోని సాయికాలనీలో నివాసముండే రాజవ్వ కంపెనీ విధులకు వెళ్లగా ఆమె భర్త యాదాగౌడ్ ఇంటికి తాళం వేసి ఉదయం 9 గంటలకు బయటకు వెళ్లిపోయాడు. గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లో దాచిన తులం బంగారు గొలుసు, 14తులాల వెండి పట్టగొలుసులు చోరీ చేశారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుటుంబీకులు చోరీని గుర్తించి పోలీసులకు సమాచారమందించారు.

కాలుష్యాన్ని నియంత్రించండి



సనత్‌నగర్ పీసీబీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

జిన్నారం, జూన్ 28: కాజీపల్లి పారిశ్రామిక వాడ కాలుష్య సమస్యను నియంత్రించాలని స్థానికులు పీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. శుక్రవారం కాజీపల్లికి చెందిన నాయకులు రమాకాంత్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళన జరిపారు. స్థానిక పరిశ్రమల నుంచి జల, వాయు కాలుష్యం నియంత్రణ లేకుండా బహిరంగ ప్రాంతాలకు వదిలి వేస్తున్నారంటూ ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం రామచంద్రాపురంలోని ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి పీసీబీ జోనల్ అధికారులు రఘు, కుమార్ పాటక్ తదితరులను కలిసి ఫిర్యాదు చేశారు. బహిరంగ ప్రాంతాలు, జల వనరులను కలుషితం చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్, మహేష్, శ్రావణ్, రంగరాజు, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హకీంపేట భూకబ్జాలపై గ్రామ మహిళల నిరసన

మాసాయిపేట జూన్ 27: హకీంపేట గ్రామంలోని సర్వే నం 161లోని తమ ఎకరం భూమితో పాటు తమ ఇళ్ల స్థలాల పట్టా సర్వే నంబరు భూములను ఓ బడా నాయకుడు అక్రమంగా కాజేయాలని చూస్తున్నాడని ఆ గ్రామ మహిళలు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయానికి మహిళలు భారీగా తరలివచ్చి నిరసనను వ్యక్తం చేస్తూ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వారు అధికారులను కోరారు.

బొగ్గు గనుల వేలాన్ని ఆపకపోతే ప్రజా ఉద్యమం

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్, జూన్ 28: బొగ్గు గనుల వేలం పాటను ఆపకపోతే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సంగారెడ్డిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలం పాటను వేస్తూ సింగరేణి కంపెనీని ప్రైవేటుపరం చేసేందుకు పూనుకున్నదని విమర్శించారు. గత పదేళ్లలో కేంద్రం 200 బొగ్గు బావులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని తీసుకువస్తున్న సింగరేణిని ప్రైవేటుపరం చేసే కుట్రను ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, సాయిలు, నాయకులు యాదగిరి, నర్సింహులు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నాపై కొందరు కక్షగట్టారు


పాండు, రైస్‌మిల్ వ్యాపారి

నర్సాపూర్, జూన్ 28: కొందరు అధికారులు తనపై కక్షతో తప్పుడు కేసులు పెట్టి అన్నివిధాల నష్టం చేశారని నర్సాపూర్‌కు చెందిన ప్రముఖ రైస్‌మిల్లు వ్యాపారి నోముల పాండు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో తనకు జరిగిన అన్యాయంపై వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. జిల్లాలో ఎంతో మంది మిల్లర్లు ప్రభుత్వానికి బకాయిలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ తన ఒక్కడిపైనే కక్ష పూరితంగా దాడులు చేసి మిల్లును నోటీస్ ఇవ్వకుండానే సీజ్ చేశారని, క్రిమినల్ కేసు కూడా పెట్టి జైలుపాలు చేశారని వాపోయాడు. దీని వల్ల తాను మానసికంగా ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానన్నారు. ఈ విషయమై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రణితరెడ్డి స్పందిస్తూ తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చట్టపరంగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సీజ్ చేసిన సమయంలో తరలించిన ధాన్యం, బియ్యం వివరాలు అన్ని పక్కాగా ఉన్నాయన్నారు.

అన్నిరంగాల్లో రాణిస్తేనే గుర్తింపు: ఖేడ్‌ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జూన్ 28: అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింగాపూర్‌కు చెందిన యాదుల్ కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అంత్రపెన్యూర్‌షిప్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ 2024లో సిల్వర్ మెడల్ సాధించినందుకు అభినందించారు. కార్యక్రమంలోజిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, ముదిరాజ్ సంఘంనాయకులు శంకర్ ముదిరాజ్, లింగాపూర్ నాయకులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్‌పై ఆరోపణలు

కంది, జూన్ 28: ఆరు గ్యారంటీలను అమలుకు కృషి చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జూలకంటి ఆంజనేయులు అన్నారు. కందిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బురద జల్లే ప్రయత్నం చేసున్నారన్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండలం అధ్యక్షుడు మోతీలాల్, నాయకులు రుద్రారం ప్రకాష్, నూన్సావత్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో నేడు జాబ్ మేళా

సంగారెడ్డి అర్బన్, జూన్ 28: తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో స్వ్కార్ సహకారంతో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్సీ బీకాం, ఎంబీఏ పూర్తయిన వారే కాకుండా డిగ్రీ విద్యార్హతలు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 9.30 గంటల వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో మరిన్ని వివరాల కోసం 7989239115 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి అర్బన్, జూన్ 28: విద్యను వ్యాపారంగా మార్చిన సంగారెడ్డిలోని శ్రీగాయత్రి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీగాయత్రీ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం పాఠశాలకు వెళ్లి ధర్నా చేశారు. ఎంఈవో వెంకటనర్సింహులు ద్వారా పుస్తకాలు, యూనిఫామ్స్ ఉన్న గదిని సీజ్ చేయించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి జిల్లాస్థాయి ఎంపికలు

మెదక్ అర్బన్, జూన్ 28: రాష్ట్ర ప్రభుత్వ క్రీడాపాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ మైదానంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 80 మంది బాలబాలికలు హాజరు కాగా, 8 మంది బాలురు, 7మంది బాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వచ్చేనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా యువజన క్రీడాధికారి నాగరాజు తెలిపారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై చర్యలు: సీఐ

రేగోడు జూన్ 28: నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని అల్లాదుర్గం సీఐ రేణుక తెలిపారు. శుక్రవారం రేగోడు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని 7 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నిజాంపేట, జూన్ 28: ఇంటి పరిసరాల్లో ఉన్న నీటినిల్వ తొట్టిలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రత్యేక అధికారి రాజేందర్ సూచించారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో శుక్రవారం డ్రైడే సందర్భంగా ప్రతీ ఇంటికి తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఎప్పటికప్పుడు ఇళ్లలోని నీటి తొట్టిలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. వెంట మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడి టీచర్లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

● హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి, మెదక్ జిల్లా ఉద్యానశాఖ అధికారి, కేవీకే శాస్త్రవేత్తలు

తూప్రాన్, జూన్ 28: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, ఉద్యానశాఖ జిల్లా అధికారి నర్సయ్య, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవికుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై అవగాహన కల్పించారు. జీవన ఎరువుల ప్రాముఖ్యత, భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించడంపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్టె ఎరువుల ప్రాముఖ్యత, పంటల్లో అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన మెలుకువలను సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్లు, కూరగాయల నారు సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. పామ్ ఆయిల్ పంటల సాగు, ఖర్జూర పంటల సాగు ప్రాముఖ్యతను వివరించారు. నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు, ఏఈవోలు సింధు, సంతోష్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ, రైతులు పాల్గొన్నారు. కాగా తూప్రాన్ మండలం యావాపూర్, అల్లాపూర్‌లలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పంటలను పరిశీలించారు. వరి నారుమడుల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై వివరించారు.


తూప్రాన్: మల్కాపూర్‌లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమంలో రైతులు, అధికారులు

మండల పరిధిలోని చీలపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో వరి నారుమడులను ఆయన పరిశీలించారు. పంట పొలాల్లో జీలుగను, పచ్చి రొట్టె ఎరువులను వేయడం వల్ల మంచి దిగుబడి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మమ, సుభాష్, రైతులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట, జూన్ 28: నారు మడుల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో లక్ష్మీప్రవీణ్ రైతులకు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని వ్యవసాయ పొలాలను సందర్శించిన ఏవో నారు మడులను పరిశీలించారు. నారుకు మొగి పురుగు తెగులు నివారించేందుకు అధికారుల సలహాలు పాటించాలన్నారు.

● వెల్దుర్తి, జూన్ 28: మండలంలోని ఆరెగూడెం గ్రామంలో రైతులు సాగు చేసిన జీలుగ పంటను శుక్రవారం ఏఈవో వందన పరిశీలించారు. రైతులు ప్రధాన పంట వేసే ముందు పచ్చి రొట్ట ఎరువులను వేసుకోవాలని రైతులకు సూచించారు. ఆమె వెంట రైతులు మహేందర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

పెద్దశంకరంపేట, జూన్ 28: సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని పెద్దశంకరంపేట మండల వ్యవసాయాధికారి యాదగిరి సూచించారు. శుక్రవారం

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలి


మనూరు: మాయికోడ్‌లో పంటల పరిస్థితిపై రైతులతో తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని

మనూరు, జూన్ 28: ఫర్టిలైజర్ యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు మాత్రమే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాయికోడ్‌లో రైతుల పొలాలను సందర్శించారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పత్తి, మినుము, పెసర, పంటలపరిస్థితి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి విత్తనాలను, రిజిష్టర్లను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే రైతులకు విక్రయించాలని ఆమె వారికి సూచించారు. ఆమె వెంట సహాయ వ్యవసాయ అధికారి నూతన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణాధికారి సంగమేశ్వర్, రైతులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నర్సాపూర్, జూన్ 28: ఎరువులు, విత్తనాలు విక్రయించే వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చట్టపరంగా తప్పవని మండల వ్యవసాయ అధికారి దీపిక హెచ్చరించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాకు రిజిస్టర్లతో పాటు విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పారా లీగల్స్‌ను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలి'

కోహీర్ జూన్ 28: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ద్వారా 2006లో నియామకమైన పారా లీగల్స్‌ను రెవెన్యూశాఖలో విలీనం చేయాలని జిల్లాలోని ఆయా మండలాల పారా లీగల్స్ శుక్రవారం హైదరాబాద్‌లోని ధరణి కమిటీ సభ్యులైన భూమి సునీల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పారా లీగల్స్ జిల్లా అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ధరణి వ్యవస్థల్లో తమను కూడా తీసుకొని, తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మొదట్లో రెవెన్యూ సేవలు అందించిన తమకు భూరికార్డుల నమోదు, భూసమస్యల పరిష్కారంపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ అనంత రాము లు, శివయ్య, నిర్మల, రమేష్, పుండలిక్, పరమేశ్వర్ రాజయ్య, సుధాకర్, మల్లేషం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేందర్

సంగారెడ్డి అర్బన్, జూన్ 28: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పి.సురేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా పటిష్టపర్చి అన్ని వర్గాలలో పార్టీని మరింత విస్తరించడానికి కృషి చేస్తానన్నారు.

జడ్పీచైర్‌పర్సన్‌ను సన్మానించిన ఉద్యోగులు


చైర్‌పర్సన్ మంజుశ్రీని సన్మానిస్తున్న జడ్పీ నాల్గో తరగతి ఉద్యోగులసంఘం నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 28: సంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా జడ్పీ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం నాయకులు నర్సింలు, రాహుల్, అమరేందర్ తదితరులు ఉన్నారు.


చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

చిన్నశంకరంపేట, జూన్ 28: వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో శ్రీరామ్ పేర్కొన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. మండల వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు ఆరోగ్య సూచనలు, సలహాలు అందించాలని ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు. గ్రామాల్లో అత్యవసరం ఏర్పడినప్పుడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైపాస్ జంక్షన్ పనులు పరిశీలించిన ఆర్డీవో

రామాయంపేట, జూన్ 28: రామాయంపేట నూతన బైపాస్ జంక్షన్ స్థలాలను మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఎస్ఈతో కలిసి ఆమె ఎక్కడి నుంచి జంక్షన్‌లు వెళ్తున్నాయనేదానిపై పరిశీలించారు. మెదక్ - సిద్దిపేట వరకు రహదారి విస్తరణ జరుగుతున్నందున రెండు జంక్షన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. రెండున్నర కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు కొత్తగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనిలో అండర్ పాస్ బ్రిడ్జిలు ఉండవన్నారు.

విద్యార్థుల ధ్రువపత్రాలను త్వరగా అందించాలి

నిజాంపేట, జూన్ 28: కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను తొందరగా అందించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. విద్యార్థుల ధ్రువీకరణ దరఖాస్తులు, ధరణి సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్డీవో రమాదేవి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో64 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేస్తామన్నారు. వెంట తహసీల్దార్ సురేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన

తూప్రాన్, జూన్ 28: తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 1,100 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తూ, మిగతావి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపినట్లు ఆర్డీవో వివరించారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, జూన్ 28: ఖేడ్‌లోని మోడల్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా నియమించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో తెలుగు-1, ఆంగ్లం-2, కెమిస్ట్రీ-1, జువాలజీ-1, కంప్యూటర్ సైన్స్-1, కామర్స్-2, హిస్టరీ-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు పొందిన వారి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. జూలై 2 వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7673967514కు సంప్రదించాలన్నారు.

● జహీరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వివిధ పాఠ్యాంశాలను బోధించేందుకు అర్హులైన గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉర్దూ 1, కామర్స్ ఉర్దూమీడీయం 1, కంప్యూటర్ అప్లికేషన్ ఇంగ్లీష్‌మీడీయం 1, కెమెస్ట్రీ ఇంగ్లీష్‌మీడీయం1, కెమెస్ట్రీ ఉర్దూ మీడీయం 1, ఖాళీలు ఉన్నాయన్నారు. జూలై 2 లోపు జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేరుగా దరఖాస్తును అందజేయాలన్నారు.

గణేష్ గడ్డ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు రూరల్, జూన్ 28: మండలంలోని రుద్రారం గ్రామ పరిధి గణేష్‌గడ్డ శ్రీ సిద్ధి వినాయక ఆలయాన్ని శుక్రవారం ఉదయం పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.


స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

జహీరాబాద్, జూన్ 28: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లానాయకుడు దత్తురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయే విధంగా కృషి చేయాలని కోరుతు ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఆహారం కల్తీ చేస్తే చర్యలు

● ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర

పుల్‌కల్, జూన్ 28: ఆహారం కల్తీ చేస్తే చర్యలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర హెచ్చరించారు. పుల్‌కల్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూహెచ్ హాస్టల్‌లో ఫ్లయింగ్‌స్క్వార్డ్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వంట గది అపరిశుభ్రంగా ఉండటం, కూరగాయలు కోసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో పాటు ముడిసరుకులు నాసిరకంగా ఉండటాన్ని గమనించారు. వాటి నమూనాలకు సేకరించి, నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్, జూన్ 28:ఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలో మెరుగైన సేవలు అందించడానికి ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి 11.30గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 99592 23170 నెంబరుకు కాల్ చేయాలన్నారు.

అవసరాలకు అనుగుణంగా రుణాలు

నారాయణఖేడ్, జూన్ 28: ప్రజలు, రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా రుణాలు ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డీజీఎం జి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నారాయణఖేడ్‌పట్టణంలో రూ.కోటితో నిర్మిస్తున్న నూతన బ్యాంకు భవనం నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బ్యాంకు పథకాల గురించి ఇంటింటి సర్వే ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ప్రజల అవసరాలను ఈ సర్వే ద్వారా గుర్తించి బ్యాంకు ద్వారా వారికి ఆర్థిక తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా తమ బ్యాంకు ద్వారా అన్ని వర్గాల వారికి సేవలు అందిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు స్వయం సహాయక బృందాలు రైతులకు అవసరమైన రుణాలను అందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా 10 వేల స్వయం సహాయక బృందాలకు 450 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. రుణాల రికవరీ శాతం కూడా ఆశాజనకంగా ఉందన్నారు. 95 శాతం రికవరీ శాతం సాధించామన్నారు. రుణాలు కావాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ బ్యాంకులో డిపాజిట్లు చేసే వారికి, ఇతర బ్యాంకుల కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఖేడ్‌లో బ్యాంకు సొంతభవనం నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. త్వరలోనే నూతన భవనం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆయన వెంట స్థానిక మేనేజర్ వెంకటేశం, ఖేడ్ పీఏసీఎస్ చైర్మన్ శోభారాణి, సీఈవో జగన్నాథం ఉన్నారు.


ఖేడ్‌లో డీసీసీ బ్యాంకు పనులను పరిశీలిస్తున్న డీజీఎం